క్లుప్తంగా

పని ప్రదేశాల్లో పెరిగిన లైంగిక వేధింపులు

ఏలూరు (టూటౌన్): మహిళలపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెరిగాయని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభలు యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు కావటం లేదని ఆరోపించారు. గృహ హింస, వరకట్న వేధింపుల నుంచి మహిళలకు బయటపడలేదని, పని ప్రదేశాల్లో శ్రమదోపిడీ కూడా పెరిగిందని, ఆయా సమస్యలపై ఈ సభల్లో చర్చిస్తామని వెల్లడించారు.

తమ్మిలేరు వంతెనను పునర్నిర్మించాలి

ఏలూరు (టూటౌన్): శనివారపు పేట తమ్మిలేరు వాగుపై శాశ్వత ప్రాతిపదికన వంతెనను నిర్మించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవి కుమార్, నగర కమిటీ సభ్యులు గొట్టాపు రవి కిషోర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్షలాది మందికి ఉపయోగపడే ఈ వంతెన పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ప్రచారం చేసుకున్న టీడీపీ కూటమి నాయకులు నేడు మౌనవ్రతం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వర్షాకాలం ఏలూరు ప్రజలను తమ్మిలేరు సమస్యలు వెంటాడుతున్నా చర్యలు తీసుకోవటంలో ఏలూరు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

తిరగబడ్డ లారీ

కొయ్యలగూడెం: స్థానిక కల్ప వృక్షం వృద్ధాశ్రమం ఎదుట జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున లారీ బోల్తాపడింది. హైదరాబాదు నుంచి తాడేపల్లిగూడెంకు మైదా లోడుతో వెళుతున్న లారీ ఎదుట వెళుతున్న లారీని ఓవర్టేక్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ నుంచి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

గ్రంథాలయ శాఖలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో జిల్లా గ్రంథాలయ శాఖలు ఏర్పాటు చేయాలని మండలంలో పాఠకులు కోరుతున్నారు. ప్రస్తుతం దెందులూరు, పోతునూరు గ్రామాల్లో మాత్రమే గ్రంథాలయాలు ఉన్నాయి. గతంలో గోపన్నపాలెంలో గ్రంథాలయం ఉండేది, దీని భవనం శిథిలమై పుస్తకాలు పేపర్లు పాడైపోవడంతో తీసివేశారు. దెందులూరు ద్వారకాతిరుమల రోడ్డులో అన్ని గ్రామాలకు సెంటర్‌గా రామారావుగూడెంలో, ఏలూరు – జంగారెడ్డిగూడెం రోడ్డులో అన్ని గ్రామాలకు సెంటర్‌గా గోపన్నపాలెం గ్రామంలో రెండు గ్రంథాలయాల బ్రాంచ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు.



చెరువులు కాదు.. రోడ్లే !

వర్షం పడితే చాలు ఆ రోడ్డు చెరువులను తలపిస్తుంది. క్యాన్సర్ హాస్పటల్, జూట్ మిల్లు, ఇందిరమ్మ కాలనీ, కొత్తూరు, పెదపాడు గ్రామాలకు వెళ్లే ప్రజలంతా ఆ రోడ్డుపై నుంచే రాకపోకలు సాగించాలి. ఆ దారిలో ఆసుపత్రికి వెళ్లేలోపే ప్రాణాలు పోయేలా ఉన్నాయని రోగులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఏలూరు వంగాయగూడెం నుంచి పెదపాడు వెళ్లే రోడ్డు దుస్థితి. కోట్లాది రూపాయలతో గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేశామని చెప్పిన నాయకులు ఈ రోడ్డు గురించి ఏం చెబుతారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చెరువులను తలపిస్తున్న వంగాయగూడెం నుంచి క్యాన్సర్ హాస్పటల్ వరకు ఉన్న రోడ్డు గుంతలు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు విద్యాలయాలు, సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో తెలుగు భాష దినోత్సవంగా నిర్వహించారు. హాలు ప్రాంగణంలోని తెలుగు తల్లి విగ్రహానికి సంస్థ మేనేజ్మెంట్ కమిటీ, కార్యనిర్వాహక కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, యిరదల ముద్దుకృష్ణ, మజ్జి సూర్య కాంతరావులు పూలమాలలు సమర్పించారు. రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించారు. ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, సభ్యులు లంక వెంకటేశ్వర్లు, జిల్లెల్లమూడి వరప్రసాదరావు. మేనేజ్మెంట్ కమిటీ గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, సహాయ కార్యదర్శి సీహెచ్ సాయి తేజ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కళాకారులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యుడు గుత్తా గిరిబాబు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషా ఉద్యమానికి పితామహుడుగా తెలుగు భాషకు అందించిన సేవలను కొనియాడారు. తెలుగు భాషా వికాసానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎస్ఎస్ఆర్ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నతానియేల్, వీవీ స్వామి మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.



వైఎంహెచ్ఏ హాలులో మాట్లాడుతున్న సత్యనారాయణ



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథులను సత్కరిస్తున్న ప్రతినిధులు

- సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష మన తల్లి భాష మన ఆచారాలను భావాలను అందంగా చూపించేది మాతృభాష అని జీతం కోసం పరభాష, జీవితం కోసం మన భాష అంటూ తెలుగు భాష ఔన్నత్యాన్ని గురించి సెయింట్ థెరిసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ఉప ప్రధానాచార్యురాలు సునీల రాణి వివరించారు. విద్యార్థినులు తెలుగులో మాండలీకాలు అనే అంశంపై ఇచ్చిన ప్రదర్శన అలరించింది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు సంబంధించిన సంస్కృతిని గుర్తు చేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, నృత్యాలు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించాయి. తెలుగు హిందీ విభాగాధిపతి సీహెచ్‌వీ మహాలక్ష్మి, అధ్యాపకులు వై.అరుణ ఝాన్సీ రాణి, కె.అరుణ నిర్వహించారు.
- ఆర్ఆర్‌పేటలోని శ్రీ శర్వాణి పాఠశాలలో పెరవలికి చెందిన మాతృభాషా పరిరక్షణ సమితి నిర్వహణలో ఏకాదశ సహస్ర గళార్చన తెలుగు శతకాన్ని 100 మంది విద్యార్థులు రాగయుక్తంగా ఆలపించారు. తెలుగు భాష గొప్పదనాన్ని తెలిపే గీతాలు, నృత్య ప్రదర్శనలు, తెలుగు తల్లి, తెలుగు కవుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యశారద, డైరెక్టర్ మదన్‌మోహన్ రాజు పాల్గొన్నారు.
- అగ్రహారంలోని శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పద్యపోటీలు, వ్యాసరచన, వక్తృత్వం, పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ జి.చంద్రరావు, తెలుగు విభాగాధిపతి కె.అనిల్ బాబులు మాట్లాడారు.

పెయింటింగ్ కార్మికులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెయింటింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని పెయింటింగ్ కార్మికుల యూనియన్ కోరింది. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా కార్యాలయంలో పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, బోర్డులో ఉండే పథకాలన్నీ పెయింటింగ్ కార్మికులకు వర్తింపజేయాలని కోరుతూ పెయింటింగ్ అడ్డాలో ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఐదుగురితో అడాప్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఏలూరు పెయింటింగ్ కార్మికుల సంఘం కన్వీనర్‌గా లొట్ల సత్యనారాయణ, అడాప్ట్ కమిటీ సభ్యులుగా, కోరాడ రెడ్డి, పాండ్రంకి రాజు, హలీం, ప్రతాప్‌లు ఉంటారని నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 21న స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మీసాల ప్రసాద్, కృష్ణ, జి నాగరాజు, ఉదయం యేసు, పి.శ్రీనువాసు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అజ్ఞానంతో మాట్లాడటం తగదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం పట్ల కొందరు అజ్ఞానంతో మాట్లాడటం తగదని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీఆర్పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పడిన రోజు సందర్భంగా సామాజిక న్యాయం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా బీఆర్ అంబేడ్కర్, సభ్యులుగా అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కేఎం మున్షి, ఎన్ మాధవరావు, డీపీ కైతన్, ఎన్ గోపాల్ స్వామి అయ్యంగార్, టీటీ కృష్ణమాచారి, సయ్యద్ మహమ్మద్ సదుల్లా ఉన్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని రెండేళ్ల 11 నెల 18 రోజుల్లో పూర్తి చేశారని గుర్తుచేశారు. రాజ్యాంగం భారమంతా అంబేడ్కర్ డ్రాప్ చేసినట్టు రాజ్యాంగ పరిషత్తులో భారత రాజ్యాంగం పరిషత్ సభ్యులు మాట్లాడారని తెలిపారు. నేటి పౌరులు దేశ చరిత్ర తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో నూకపేయి కార్తీక్, స్వరూప, పెరియార్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	36	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	24–32	బీట్‌రూట్	36
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70–90
క్యారెట్	40–48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07–10
దోసకాయలు	20–28	పుదీనా	05
ఆనబకాయ (1)	20–30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	28
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

బేరన్ కూల్చివేత అన్యాయం

బుట్టాయగూడెం: అన్యాయంగా తన బేరన్ కూల్చారని మండలంలోని సూర్పవారిగూడెంకు చెందిన బళ్లా భూలక్ష్మి అనే గిరిజన మహిళ వాపోయింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. »ముప్పినవారిగూడెంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి నాలుగు బేరన్‌లు ఒక షెడ్‌ను రూ.35 లక్షలకు కొన్నాను. ఈ మేరకు సొమ్ము చెల్లించినప్పటికీ మరో రూ.8 లక్షలు అడుగుతున్నాడు. రెండు బేరన్లు మాత్రమే నా పేరును ఉన్నాయి. మిగిలిన రెండు బేరన్లు నా పేరున మార్చిన తర్వాత సొమ్ము చెల్లిస్తాను. అయితే మూడు రోజుల క్రితం షెడ్‌లో నేను, నా కుమారుడు నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఆ వ్యక్తితోపాటు మరికొందరు వచ్చి దాడి చేశారు. బేరన్‌ను కూడా కూల్చివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాకు పూర్తి న్యాయం చేయాలి« అని భూలక్ష్మి పేర్కొంది.

పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: మారుతున్న వాతావరణం పరిస్థితులు కనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కొవ్వలి ఫ్రైడే–డ్రైడేలో భాగంగా ఇంటింటా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సీసాలు, బకెట్లు టైర్లలో నీరు నిల్వ ఉంచొద్దన్నారు. మురుగునీరు దిగు ప్రాంతానికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎం సరిత, సీహెచ్ఓ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబానికి తాము రుణపడి ఉంటామని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నిట్టా గంగరాజు, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. తమ కుటుంబంలో ఉప సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొన్ని అవకాశాలు కల్పించి ప్రోత్సహించిన విధానం ఎన్నటికీ మరువలేమని వారు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. శుక్రవారం అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆయన్ని గంగరాజు కుటుంబ సభ్యులు కలిశారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారి వెంట కుమార్తె అన్సు ఉన్నారు.



హరిద్రగణపతిగా సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి



ఏలూరు మెయిన్‌బజార్‌లోని భారీ వినాయకుడు



కుందీ సెంటరులోని భారీ వినాయకుడు



నరసింహరావు పేటలో వినాయకుడు

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఏలూరులో ఏర్పాటు చేసిన 200కుపైగా మండపాల్లో స్వామి వారికి నిత్య ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో భక్తులు పూజల్లో పాల్గొంటున్నారు. భక్తులు శనగలు, పులిహోర, చక్కెరపొంగలి, కేసరి వంటి ప్రసాదాలు తయారు చేసుకుని వచ్చి స్వామి వారికి సమర్పిస్తున్నారు. సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో మూడో స్వామి వారికి హరిద్రగణపతి అలంకరణ చేశారు. లక్ష్మీ కుబేర వ్రతాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



సుబ్బమ్మదేవి స్కూల్ సెంటరులో వినాయకుడికి దీపారాధన చేస్తున్న దృశ్యం



విజయవిహార్ సెంటరులో..

స్మార్ట్ మీటర్లు పెడితే గద్దె దించుతాం

కామవరపుకోట: విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టడంతో పాటు సర్దుబాటు చార్జీల పేరుతో నిత్య వినియోగదారులపై మోయలేని భారం మోపితే చూస్తూ ఊరుకోమని గద్దె దించడానికి ప్రజా ఆందోళన నిర్వహిస్తామని సీపీఐ, ఏఐటీయూసీ, బీకేఎంయూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ శుక్రవారం స్థానిక చౌతన సెంటర్‌లో ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లు ఎక్కడ పెడుతున్నా గ్రామాల్లోని ప్రజలంతా ఐక్యమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీ పెద్దలు ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారమోపితే సహించేది లేదని హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెంచే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప వెంకట సత్తిరాజు, మండల కార్యవర్గ సభ్యులు గుమ్మడి లక్ష్మణరావు, చలమాల శ్రీనివాసరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బీవీ రాఘవులు, నల్లమోతుల అప్పన్న, కోతాటి వెంకటేశ్వరరావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కంకిపాటి పుల్లయ్య, మల్ల చెన్నకేశవరావు, అడపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చౌతన సెంటర్లో ధర్నా చేస్తున్న నాయకులు

జెట్టిని కలిసిన పట్టణ ప్రచార కమిటీ

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ ప్రచార కమిటీని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు ఆదేశాల మేరకు నియమించారు. ప్రచార కమిటీ అధ్యక్షుడిగా వెన్నపూస కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లవరపు నాగపోసు, సైదం నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా ఉల్లపు రవి, తమ్మిశెట్టి సాయి, శిలరపు ప్రశాంత్, కొప్పుల భాగ్యరాజ్, కార్యదర్శులుగా షేక్ బాబా వల్లి, కట్ట మహేష్, బలగం లక్ష్మీనారాయణ, చిత్రాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా తీగరెడ్డి దుర్గారావు, చలపాక నాగరాజు, దండాగుల వెంకటేశ్వరరావులు నియమితులయ్యారు. వీరు శుక్రవారం పార్టీ మచిలీపట్నం పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును, నాయకులు జెట్టి ఆదిత్య, పట్టణాధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్త, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకన్నలను మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు.



గురునాథరావుతో వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రచార నూతన కమిటీ

2400 మంది నిరక్షరాస్యుల గుర్తింపు

దెందులూరు: 2,400 మంది నిరక్షరాస్యులను గుర్తించి, వారికి వలంటీర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామని వయోజన విద్య ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఆఫీసర్ విజయ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారి కె.శ్రీదేవి ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర – అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథి విజయకుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. మండలంలో స్వయం సహాయక సంఘాల్లో 2400 మంది నిరక్షరాస్యులను గుర్తించి, మొత్తం మండలంలో 240 మంది వలంటీర్లను నియమించామని చెప్పారు. వీరికి సెప్టెంబర్ నుంచి మార్చి వరకు శిక్షణ ఇచ్చి అనంతరం పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. ఎంపీడీఓ కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను అక్షరాస్యత ద్వారానే వినియోగించుకోవచ్చని అన్నారు. నిరక్షరాస్యులు అందరూ అక్షరాస్యులుగా వలంటీర్లు మార్చాలని సూచించారు. కార్యక్రమానికి ఏపీఎం పి.సురేష్ కుమార్, ఎంఈఓ ప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు చిట్టెమ్మ వలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

వరిలో ఎరువుల నిర్వహణ ముఖ్యం

పెదవేగి: వరి పంటలో ఎరువుల నిర్వహణ ముఖ్యమని శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదకడిమిలో రైతుల పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ శాస్త్రవేత్త ఫణికుమార్ మాట్లాడుతూ వరి పంటలో నత్రజని ఎరువుగా యూరియా బదులు అమోనియం సల్ఫేట్ వాడుకోవచ్చన్నారు. అమోనియం సల్ఫేట్ వాడితే పంటకు నత్రజనితో పాటు గంధకం (సల్ఫర్) కూడా లభిస్తుందని తెలిపారు. ఏడీహెచ్ సంతోష్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల మోతాదు నిర్ణయించుకోవాలని సూచించారు. రైతుల ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేశారు.